# కాంగ్రెస్ గూండాగిరి

- బీఆర్ఎస్ నేతలపై అకారణంగా దాడి
- ప్రచారం నిర్వహిస్తున్న శ్రేణులపై తెగబడిన హస్తం పార్టీ నాయకులు



కోస్గిలో ఘర్షణ పడుతున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు

కోస్గి, నవంబర్ 14 : కొడంగల్ నియోజకర్గంలో కాంగ్రెస్ నాయకుల రౌడీఇజం రోజురోజుకూ పెరుగుతున్నది. నిత్యం ఎక్కడో ఒకచోట బీఆర్ఎస్ అభ్యర్థులు, ప్రచారం చేస్తున్న గులాబీ పార్టీ నేతలపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమం లో నారాయణపేట జిల్లా కోస్గి, సర్జఖాన్‌పేట్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఉప్పల్ నియోజకర్గం లోని సోమశేఖర్‌రెడ్డి అనుచరులు 30 మంది మంగళవారం సర్జఖాన్‌పేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ప్రశాంతంగా ప్రచారం చేసు కుంటున్న గులాబీ పార్టీ నేతల వాహనాలపై కాంగ్రెస్ నేత, గ్రామ సర్పంచ్ హరీశ్‌గౌడ్, నాయకుడు లక్ష్మీనారాయణగౌడ్, రాఘవేందర్‌గౌడ్, శెట్టి శివకుమార్, మద్దూరు బాలు, ఉప సర్పంచ్ మూచ అశోక్, ఎండీ కాశీం రాళ్లతో దాడికి పాల్పడ్డారు. దీంతో సోమశేఖర్‌కు చెందిన సఫారీ వాహనం అద్దాలు పగిలి పోయాయి. దీంతో బీఆర్ఎస్ నేతలకు, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదంతో తోపులాట జరిగింది. విషయం తెలుసుకున్న పోలీ సులు ఘటనాస్థలికి చేరుకొని ఇరువర్గాలను సముదాయించి అక్కడి నుంచి పంపించేశారు. అనంతరం దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు కోస్గి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తర్వాత స్టేషన్‌ను కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. సీఐతో ఎమ్మెల్యే మాట్లాడి దాడికి పాల్పడి న వారిపై కేసు నమోదు చేయాలన్నారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్దకు నాయకులు చేరుకొని ధర్నా చేపట్టారు. రేవంత్‌రెడ్డి డౌన్‌డౌన్ అంటూ గులాబీ శ్రేణులు నినాదాలు చేశారు. అయితే ఇదే సమయంలో శివాజీ చౌరస్తాలో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ శ్రేణులపై ముప్పేట రాళ్ల దాడికి పాల్పడ్డారు. దీంతో పలువురు నేతలకు గాయాలయ్యాయి. విజయ్‌కుమార్, మైబు, లక్ష్మారెడ్డి, రమేశ్‌తోపాటు పలువురు గాయపడగా.. పోలీసులు, స్థానిక నాయకులు కోస్గి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. స్థానిక బీఆర్ఎస్ నేత వెంక టనర్సింహులుకు చెందిన షిఫ్ట్ డిజైర్ కారు అద్దాలు కాంగ్రెస్ నేతల దాడిలో పగిలాయి.



గాయపడ్డ బీఆర్ఎస్ కార్యకర్త



సీఐతో మాట్లాడుతున్న కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

## ఓటమి భయంతోనే దాడులు

- కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కోస్గి, నవంబర్ 14 : బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేస్తుంటే ఓడిపోతామనే భయంతో పిరికిపందలా రేవంత్‌రెడ్డి వర్గాలు దాడులకు పాల్పడడం సిగ్గుచేటని కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం కోస్గిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ఓడిపోతామని తెలిసి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజలను భయబంతులకు గురిచేసి గెలుపొందాలని చూస్తున్నారని ఆరోపించారు. కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి ఘోరమైన ఓటమి చవిచూడడం ఖాయమని, ఎన్నిడ్రామాలు చేసినా ప్రజలు నమ్మరన్నారు. గతంలో హుస్నాబాద్‌లో ఇంలాంటి డ్రామాలే చేశారని గుర్తుచేశారు. నేను సీఎం అయిన తర్వాత మీ అంతు చూస్తానంటూ మీడియాను సైతం బెదిరిస్తున్నారని, ఇంతటి దిగజారుడు రాజకీయాలను గతంలో ఎప్పుడూ తెలంగాణ ప్రజలు చూడలేదన్నారు. సీఎం అవుతానని పగటికలలు కంటున్నారని, ఇలాంటి రౌడీరాజకీయ నాయకులకు ప్రజలే తగిన బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్‌కు అధికారమిస్తే రాష్ట్రం అల్లకల్లోలం అవుతుందనేందుకు బీఆర్ఎస్ నేతలపై జరుగుతున్న దాడులే నిదర్శనమని ప్రజలు గుర్తించాలన్నారు.

## సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకం

- కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట టౌన్, నవంబర్ 14: ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకమైనదని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. మంగళవారం పట్టణంలోని నైపుణ్య శిక్షణ అభివృద్ధి కేంద్రంలో ఈవీఎంల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్టోరియల్ అధికారులు ఈవీఎం మిషన్‌లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల వేళ ఎలాంటి సాంకేతిక సమస్య ఎదురైనా వెంటనే స్పందించి పోలింగ్ కేంద్రానికి చేరుకొని సమస్యను పరిష్కరించే స్థాయికి చేరుకోవాలన్నారు. ఈవీఎంల తరలింపు నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాలకు సంబంధించిన ఓటర్ స్లిప్‌లు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయని, ఏఆర్‌వోలు, బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించి ఓటర్ స్లిపుల్లు ఓటర్లకు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్‌వో రాంచందర్, డీఆర్డీవో గోపాల్‌నాయక్, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్ ఓటరు స్లిప్పుల పంపిణీ, వెబ్ క్యాస్టింగ్ నిర్వహణపై నిర్వహించిన వీసీలో కలెక్టర్ శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

నారాయణపేటరూరల్, నవంబర్ 14: పేట మండలంలోని అప్పక్‌పల్లి, చిన్నజట్రం, జాజాపూర్, దామర్‌గిద్ద మండలంలోని కంసాన్‌పల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఎన్నికల అబ్జర్వర్లు బీపీ చౌహన్, ధ్రువ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు పోలింగ్ కేంద్రాల్లోని ఏర్పాట్లను పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడి గ్రామ పరిస్థితులను అడిగి తెలుసుకొన్నారు.

## నేటి బాలలే రేపటి పౌరులు

- డీఈవో అబ్దుల్ ఘని

నారాయణపేట టౌన్, నవంబర్ 14: నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని డీఈవో అబ్దుల్ ఘని అన్నారు. పట్టణంలోని బాలకేంద్రంలో మంగళవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలు చదువుతో పాటు సంస్కృతి, సాంప్రదాయ కళలను నేర్చుకోవాలన్నారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంవో విద్యాసాగర్, బాలకేంద్రం సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి, నర్సింహులు, లక్ష్మణ్, వసంత్, జ్ఞానామృత తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని హంసవాహిని పాఠశాలలో ప్రిన్సిపాల్ రాజేశ్ నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

# దేశానికే ఆదర్శం

- అభివృద్ధిని చూసి స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరికలు
- ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి



బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలతో ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

నారాయణపేట, నవంబర్ 14: ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణలో అమలు చేస్తూ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో దామరగిద్ద మండలం లో కుర్తి గ్రామానికి చెందిన 50 మంది బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కార్యకర్తలు, సజనాపూర్ గ్రామానికి చెందిన 50 మంది బీజేపీ, కమ్యూనిస్ట్ పార్టీలకు చెందిన కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను మెచ్చి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో స్వచ్ఛందంగా చేరుతున్నారన్నారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే అమలు చేయనున్న సంక్షేమ పథకాల గురించి సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టోలో పొందుపరచారన్నారు. పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని కోరారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో రమేశ్ గౌడ్, రామస్వామి, సాయికుమార్, ఉషన్న, నరేశ్, సాయప్ప తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నా యకులు ఆశన్న, వెంకట్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, భీంరెడ్డి, బసిరెడ్డి, నర్సప్ప, బసంత్‌రెడ్డి, గురునాథ్ గౌడ్ పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి పట్టం కట్టండి

- ఎమ్మెల్యే సతీమణి స్వాతిరెడ్డి

నారాయణపేట రూరల్, నవంబర్14: సీఎం కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సక్షేమ పథకాలు, పేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధిని చూసి మరో సారి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే సతీమణి స్వాతిరెడ్డి ఓటర్లను కోరారు. మంగళవారం పేట మండలంలోని జాజాపూర్ గ్రామంలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాలను వివరిస్తూ కారుగుర్తుకు ఓటేసి రాజేందర్‌రెడ్డికి హ్యాట్రిక్ విజయం అందించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అంజలి, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయా చంద్రకాంత్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జ్యోతి, బీఆర్ఎస్ మైనార్టీ మండల అధ్యక్షుడు అలీశేర్, నాయకులు డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, జావిద్, వెంకటప్ప, గందె చంద్రకాంత్, డాక్టర్ రంజిత, ఫాతిమాబేగం, కౌన్సిలర్లు మేఘాశ్రీపాద్, శిరీషా పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి స్వాతిరెడ్డి